ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మహబూబాబాద్
శనివారం 15 జూన్ 2024




పీజీ తరగతులు నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రేకుల ఆడిటోరియం ఇదే..

సౌలతుల్లేవ్ !

రేకుల షెడ్డులో.. మానుకోట సెల్ఫ్‌ఫైనాన్స్ పీజీ కళాశాల

- 2013లో కేంద్రమంత్రిగా బలరాంనాయక్ హయాంలో సెంటర్ ఏర్పాటు
- పదేళ్లయినా రెగ్యులర్ కోర్సుగా మారని వైనం
- అరకొర వసతులు, పార్ట్‌టైమ్ అధ్యాపకులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- భవనానికి స్థలం కేటాయించినా, హద్దులు చూపని అధికారులు
- పార్లమెంట్ పరిధిలోనే ఏకైక ఉన్నత విద్యాసంస్థ
- మళ్లీ ఎంపీగా గెలిచిన బలరాంపైనే ఆశలు

మహబూబాబాద్, జూన్14 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్ ఫైనాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సెంటర్ అరకొర వసతుల మధ్య రేకులషెడ్డులోనే కొనసాగుతోంది. 2013వ సంవత్సరం నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మానుకోట పట్టణంలో ఆర్ట్స్ విభాగంలో ప్రవేశాలు కల్పించి, తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పరిపాలనా సౌలభ్యం కోసం 2016లో నూతన జిల్లాలను ఏర్పాటు చేసి, అందుకు కావాల్సిన కార్యాలయాలు ఏర్పాటు చేసి అధికారులను నియమించింది. అందులో భాగంగానే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పీజీ కళాశాలకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించనా అధికారులు హద్దులను ఏర్పాటు చేయలేదు. పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించేందుకు రెగ్యులర్ అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పీజీ కళాశాలలో అన్నివసతుల మధ్య ఉన్నత విద్య లభిస్తుందన్న ఆ విద్యార్థులకు నిరాశ తప్పడం లేదు. మానుకోట జిల్లాగా ఏర్పడి జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం అందుబాటులో ఉన్నా ఉన్నత విద్యనందించే కళాశాలను మాత్రం పట్టించుకోకపోవటం పట్ల విద్యాభిమానులు, విద్యావేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు రెగ్యులర్ అధ్యాపకులను కేటాయించక పోవడంతో కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన అధ్యాపకులతోనే బోధన కొనసాగిస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి సెకండ్ సెమ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. గతేడాది లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా పురాతన రేకులషెడ్డులోనే తరగతులు కొనసాగిస్తున్నారు.

యూజీసీ నిబంధనల ప్రకారం..

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనల ప్రకారం పీజీ సెంటర్‌ను ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన తర్వాత రెగ్యులర్ కోర్సుగా మార్చి రెగ్యులర్ అధ్యాపకుల నియామకంతో పాటు అన్ని వసతులు కల్పించాల్సి ఉంటుంది. రెగ్యులర్ అధ్యాపకుల మాటదేవుడెరుగు.. కానీ, డిగ్రీ కళాశాలలోని రేకుల షెడ్డులోనే కొనసాగటం పట్ల విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, వెనకబడిన తరగతుల జనాభా అధికంగా ఉన్న మానుకోటలో నిర్వహించబడుతున్న పీజీ కళాశాలకు పక్కాభవనం నిర్మించటంతో పాటు అన్ని వసతులు కల్పించేందుకు మహబూబాబాద్-ఇల్లందు ప్రధానరహదారి ఆర్టిగార్డెన్ సమీపంలోని సర్వేనెంబర్ 287లో ఏడు ఎకరాల భూమి ని కేటాయించారు. రెవెన్యూ అధికారులు సదరు సర్వేనెంబర్ గల భూమి హద్దులను చూపించక పోవడంతో ప్రస్తుతం అందులో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు గుడిసెలు వేశారు.

కళాశాలలో కోర్సులివే..

2013వ సంవత్సరంలో కాకతీయ యూనివర్సిటీ (కేయూ) పరిధిలో తొలిసారిగా మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు ఆర్ట్స్ కోర్సులతో ప్రారంభించబడింది. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), మాస్టర్ ఆఫ్‌కామర్స్ (ఎంకాం), ఎంఏ తెలుగు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ పబ్లిక్‌అడ్మినిస్ట్రేషన్ గ్రూపులు ఉన్నాయి. 2023-24 విద్యాసంవత్సరం వరకు ప్రతీ కోర్సులో 40 సీట్లు ఉండగా, 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఈన్ని కోర్సుల్లో 60 సీట్లకు పెంచారు.

విద్యార్థుల అవస్థలు..

మానుకోట పట్టణంలోని పీజీ కళాశాలలో అధ్యాపకుల కొరతతో పాటు మౌళిక వసతుల లేమితో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడ గదులు లేకపోవడం, ఉన్న రేకుల షెడ్డులోనే తరగతులు నిర్వహిస్తోండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. గ్రూపుల వారీగా విద్యార్థులకు తరగతుల నిర్వహణ కష్టంగా మారింది. మరుగుదొడ్లు లేకపోవటం వలన ఇబ్బందులు పడుతున్నారు. సరైన వసతులు లేనికారణంగా గత విద్యాసంవత్సరం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అర్థశాస్త్రం, కామర్స్ విభాగాల్లో తక్కువ సంఖ్యలో విద్యార్థులు ప్రవేశం పొందటం ద్వారా ఈ మూడు సబ్జెక్టులను ఎత్తివేసే పరిస్థితి



మానుకోటలో పీజీ కళాశాల ప్రారంభోత్సవం నాడు ఏర్పాటు చేసిన శిలాఫలకం

నెలకొంది. దీంతో ఇక్కడ కోర్సులు లేక ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత చదువుకు దూరమయ్యే

మిగతా 8వ పేజీలో..

ఎంపీ బలరాంనాయక్ పైనే ఆశలు..



మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో 2013లో కేంద్రమంత్రిగా ఉన్న పోరిక బలరాంనాయక్ సహకారంతో పట్టణంలో పీజీ కళాశాల మంజూరైంది. నాడు భవనం లేకపోవడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రేకులతో కూడిన ఆడిటోరియం, తరగతి గదుల్లో బోధన కొనసాగిస్తూ వచ్చారు. నాడు మహబూబాబాద్- ఇల్లందు ప్రధాన రహదారి ఆర్టిగార్డెన్ సమీపంలోని సర్వే నెంబర్ 287లో ఏడు ఎకరాల భూమిని పీజీ కళాశాల భవనం నిర్మాణం కోసం కేటాయించారు. రెవెన్యూ అధికారులు భూమి హద్దులను కేటాయించక పోవడంతో ఆ విషయం మరుగున పడింది. నాటి నుంచి నేటి వరకు యూనివర్సిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు కూడ పీజీ కళాశాలకు భవనం నిర్మించాలన్న ఆలోచన కూడా చేయలేదు. దీంతో సొంత భవనం లేక పీజీ తరగతులు రేకులషెడ్డులోనే నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి రెండు దఫాలుగా గెలిచిన బీఆర్ఎస్ ఎంపీలు కూడా కళాశాల భవన నిర్మాణంపై దృష్టి సారించలేదు. మళ్లీ పదేళ్ల తర్వాత మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్ గెలుపొందారు. నాడు పీజీ కళాశాలను మంజూరు చేయించిన బలరాంనాయక్ భవన నిర్మాణంపై దృష్టిసారిస్తారనే ఆశలు చిగురిస్తున్నాయి. దశాబకాలంగా రేకులషెడ్డులో కొనసాగుతున్న పీజీ కళశాల భవన నిర్మాణానికి కృషి చేయాలని విద్యార్థులు, విద్యావేత్తలు కోరుతున్నారు.


పీజీ తరగతులు నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రేకుల గదులు

ఏకైక పీజీ కళాశాల..

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏకైక పీజీ కళాశాలకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో వరంగల్ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల సబ్ క్యాంపస్‌కు ఉన్న వసతులు ఉండాల్సి ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ములుగు, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మానుకోట నియోజకవర్గంలోని నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న ఏకైక కళాశాల మానుకోట పీజీ కళాశాల. గిరిజన పార్లమెంటరీ నియోజకవర్గ పరిధి మానుకోట జిల్లా కేంద్రంలో ఉన్న పీజీ కళాశాలకు ప్రజాప్రతినిధులు రాబోయే రోజుల్లో శాశ్వత భవనం, మౌళిక వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తారనే ఆశాభావం వక్తం చేస్తున్నారు.

'కొండా' నివాసానికి మంత్రులు

వరంగల్ సిటీ, జూన్ 14 : అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖమంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నివాసంలో శుక్రవారం స్పీకర్ సహా పలువురు మంత్రులు, నేతలుసందడి చేశారు. పలువురు రాష్ట్ర మంత్రులు సందడి చేశారు. హనుమ కొండ హంటర్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి సంవత్స రీక కార్యక్రమానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వరంగల్ మేయర్ గుండు సుధారాణి, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి సురేఖతో సరదాగా మాట్లాడుతూ 'పొరుగు జిల్లా వాళ్లం వచ్చాం.. ఇంటికి పిలిచి కనీసం చాయ్ ఇవ్వవా అక్కా' అని అనడంతో సురేఖ అందరినీ హనుమకొండలోని తన నివాసానికి తీసుకెళ్లారు. వారికి టీ ఇచ్చి, కొద్దిసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. అయితే ఇటీవల మంత్రులు సురేఖ, సీతక్క మధ్య వైరం నడుస్తోందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వారిద్దరూ అటు ఫంక్షన్ హాలులో, ఇటు కొండా నివాసంలోను పక్క పక్కనే కూర్చుని సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం ఆసక్తిరేపింది.


మంత్రి సురేఖ నివాసంలో ముచ్చటించుకుంటున్న స్పీకర్, మంత్రులు, నేతలు


కొండా సురేఖ, సీతక్క

మంత్రి సురేఖను కలిసిన నీలం మధు

కాంగ్రెస్ నుంచి మెదక్ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన నీలం మధు శుక్రవారం హనుమకొండలోని మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. సురేఖకు మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న నేపథ్యంలో మధు హనుమకొండకు వచ్చి మంత్రిని కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు.


బోల్తా పడిన కలప దుంగల లారీ

మూలమలుపులో కలప లారీ బోల్తా

దుంగలు మీదపడి ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో సీఐ గన్‌మెన్, సీఆర్టీ ఉపాధ్యాయుడు
- గూడూరు మండల కేంద్రంలో ఘటన


పాపారావు (ఫైల్)


దేవేందర్ (ఫైల్)

వివరాలు 7లో..

ఇక 'విద్యుత్ ప్రజావాణి'

ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16సర్కిళ్లలో ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, అదేరోజు మధ్యాహ్నం 3గంటల సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యుత్ ప్రజావాణిని పటిష్టపరచడంలో భాగంగా సమీక్షలు నిర్వ హించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. ఇందు కోసం టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లకు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదికగా విద్యుత్ ప్రజావాణి నిలుస్తుందని సీఎండీ వెల్లడించారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్

మహబూబాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ షెడ్యూల్ ప్రకటనకు ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రాష్ట్రంలో 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని చెప్పారు. మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి, వెంటనే పరిష్కరించాలన్నారు. డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను సమీక్షించుకుని అధికంగా పెండింగ్‌లో ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయిలో ప్రతీ మంగళవారం, శుక్రవారం నిర్వహి స్తున్న ప్రజావాణిలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం జిల్లా కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వాటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి, త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు భద్రకాళి, రమణి పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న అద్వైత్‌కుమార్‌సింగ్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

మహబూబాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో గర్భిణీలకు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పోతో కలిసి జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రోపియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ స్కానింగ్ సెం టర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీచేసి ఫారం-ఎఫ్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. యుక్తవయస్సులో ఉన్న యువతకు గర్భస్థ లింగనిర్ధారణ నిషేధిత చట్టం గురించి

మిగతా 8వ పేజీలో..





నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలి

బల్దియా కమిషన్ అశ్విన తానాజీ వాకడే



మడికొండలో భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రేటర్ వరంగల్ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విన తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండలో పర్యటించి అక్కడి భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చట్టంలో చూపించి విధంగా నిబంధనల మేరకు ప్రమాణాల ప్రకారం భవనాలు నిర్మించే కట్టడాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్


సుబేదారి, జూన్ 14 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీలోని జనరిక్ మందుల షాపు తలసేమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా సెంటర్‌తో పాటు జనరిక్ మెడికల్ షాపు నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయని ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను రక్తదాన శిబిరాలను నిర్వహించిన ఆర్గనైజర్లను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

కార్యక్రమం అనంతరం ఉత్తమ రక్తదాతలుగా ఎంపికైన వారికి కలెక్టర్, పాలక వర్గం చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డు, శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్‌ను పాలకవర్గం షీల్డు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, బాషెట్టి హరిప్రసాద్, రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.















రాంనగర్‌లోని తన నివాసంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి సురేఖ

ఎప్పుడైనా.. ఎక్కడైనా నన్ను కలవొచ్చు

● అటవీ, దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

● నివాసంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

వరంగల్‌సిటీ, జూన్ 14: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఎవరైనా.. ఎప్పుడైనా.. ఎక్కడైనా తనను కలవచ్చని అటవీ, దేవాదాయ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో తూర్పు నియోజకవర్గంలో నుంచి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేమన్నారు. మంత్రిగా ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ లేదా ఇతర జిల్లాల పర్యటనలో ఉన్నప్పుడు నియోజకవర్గానికి చెందిన నాయకులు ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్‌లోని తన నివాసంలో లేదంటే సెక్రటేరియెట్‌లో కలవవచ్చని తెలిపారు. శుక్రవారం సుమారు 150 వినతులను పరిష్కరించినట్లు తెలిపారు.

గొర్రెలకాపరితో ప్రభుత్వ పథకాలపై ఆరా...

హనుమకొండ రాంనగర్‌లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం తోటి మంత్రులు, ప్రజలు, నాయకులతో మంత్రి సురేఖ బిజీబిజీగా గడిపారు. సాయంత్రం మంత్రి హైదరాబాద్ బయలుదేరారు. మార్గ మధ్యలో ఓ గొర్రెలకాపరి గొర్రెల మందతో రోడ్డు పక్కన వెళుతుండగా మంత్రి కాన్వాయ్ దిగి అతడి వద్దకు వెళ్లి రెండు చిన్న గొర్రెపిల్లలు ఎత్తుకున్నారు. గొర్రెలకాపరితో ముచ్చటిస్తూ ప్రభుత్వ పథకాలు మీకు, మీ గ్రామస్థులకు చేరుతున్నాయా.. అంటూ నెమ్మదిగా ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కొద్దిసేపు మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పురుషోత్తం రెడ్డి సేవలు మరువలేనివి



వేం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

బాలసముద్రం, జూన్ 14: ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి ప్రథమ వర్ధంతిని హనుమకొండలోని సీఎస్ఆర్ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్‌గౌడ్, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ ఉప ముఖ్య మంత్రి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపద్బాంధవులు

అత్యవసర సమయాల్లో డీఆర్‌ఎఫ్ సేవలు భేష్

దయనీయ స్థితిలో సిబ్బంది పరిస్థితి

చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీత

బల్దియా కమిషనర్ పట్టించుకోవాలని వేడుకోలు



బల్దియా పరిధిలో సేవలందించే డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) విపత్తు ప్రతిస్పందన దళం సమస్యల వలయంలో కునారిల్లుతోంది. సిబ్బందికి ప్రభుత్వం నుంచి అందించే కనీస సౌకర్యాలు అందించకపోవడంతో పాటు నెలవారిగా వచ్చే చాలీచాలనీ జీతం సైతం సమయానికి అందకపోవడంతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. నగర ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసే డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలు వెలకట్టలేకుండా ఉన్నా వారిపనికి గుర్తింపు లేదు. సిబ్బందికి పనికి సరిపడా వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలు, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కొంత మేరకు జీతాలు పెరిగితే భాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అన్ని అలవెన్స్‌లు కలుపుకుని రూ. 17,500 మాత్రమే వస్తున్నాయని, కనీసం రూ. 25వేల వరకు జీతం పెంచితే పిల్లల చదువులకు ఉపయోగపడుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.

అయితే ఐదేళ్ల కాలంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 30 మంది డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌ల పరిధిలో 12లక్షలకు పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. కానీ 24 కిలో మీటర్ల దూరం విస్తరించి ఉన్న బల్దియా పరిధిలో విపత్తు జరిగిన సమయంలో ప్రమాదస్థలికి వెళ్లాలంటే సిబ్బందికి ప్రాణసంకటంగా మారుతోంది. మంటల్లో చిక్కుకున్న వారిని సైతం తీసేందుకు వీరినే వినియోగించడం, గ్యారెంటీ లేని వీరి జీవితాలకు కార్పొరేషన్‌పరంగా కనీస బీమా కల్పించకపోవడం బాధిస్తోందంటున్నారు. నీటి ప్రమాదాల్లో మృతిచెంది ముక్కలుగా విడిపోతున్న శరీర భాగాలను వెలికి తీసే వీరి పని సాహసోపేతమైనది.

2010లో డీఆర్‌ఎఫ్ విభాగం ఏర్పాటు

ప్రజలు నివసించే ప్రదేశాల్లో విపత్తు జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులను అదుపు తెచ్చి ప్రాణనష్టం జరుగకుండా కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా డీఆర్ఎఫ్ (విపత్తు ప్రతిస్పందన దళం) బృందాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషనర్‌గా పమేలా సత్పతి పని చేసిన కాలంలో వరంగల్ బల్దియాలో 2019 జూన్ మాసంలో డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేకుండా నగరంతో పాటు విలీన గ్రామాల గ్రామ పంచాయతీ కార్యాలయాలకు అనుసంధానంగా పని చేసే దినసరి ఉద్యోగులలో ఆసక్తి ఉన్నవారిని మౌఖిక పరీక్ష ఆధారంగా డీఆర్ఎఫ్ విభాగంలో నియమించారు. 30మందితోపాటు ఇద్దరు డ్రైవర్లను నియమించారు. సిబ్బందిని పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జి ఉంటారు. కాగా, డీఆర్ఎఫ్ సిబ్బంది ఎల్లవేళలా విధులు నిర్వర్తిస్తారు. రోజుకు మూడు షిఫ్టులతో పని చేస్తూ నక్కలగుట్ట వాటర్ ట్యాంక్, బల్దియా ఇండోర్ స్టేడియం వద్ద స్టాండింగ్ డ్యూటీలో ఉంటారు.

అత్యవసర సమయంలో..

బల్దియా పరిధిలో ఎలాంటి విపత్తు జరిగినా టోల్ ఫ్రీ నెంబర్ 18004351980తో పాటు 9701999676 రిస్క్‌కాల్ కావడంతో బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బందికి అప్రమత్తం చేస్తారు. వీరు రాత్రనక, పగలనక ఘటనా స్థలానికి చేరుకుని పనిలో నిమగ్నమై పోతారు. కిందటేడు వర్షాకాలంలో నగరం నీటమునగడంతో పాటు చాలాచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరుకోగా చాలామంది ప్రాణాలు కాపాడడంతో వీరి కృషి వెలకట్టలేనిది. ఇంకా భద్రకాళి చెరువు మత్తడి పడి చెరువు కట్ట తెగిపోవడంతో వీరు దిగువ ప్రాంతంలో ఉన్న వారిని అప్రమత్తం చేయడంతో పాటు విలువైన వస్తువులను గడ్డకు చేర్చారు. అంతేకాకుండా వర్షాలు, ఫ్లడ్స్, పేలుళ్లు, అగ్నిప్రమాదాలు, నీటి ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, చెరువులు, కెనాల్‌లో పడిన మనుషుల మృతదేహాలు, జంతువులు కళేబరాలు తీయడం, గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడి పోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేయడం వంటి పనులు చేస్తారు. అంతేకాకుండా నగరంలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలు, అక్రమ నిర్మాణాలు, అక్రమ ర్యాంప్‌ల నిర్మాణాలు, అక్రమ వెంచర్‌ల నిర్మాణాలను తొలగించేందుకు డీఆర్ఎఫ్ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సిబ్బంది కొరత వల్ల ప్రమాదాలు జరిగే ప్రతీ చోటికి వెళ్లడం కష్టంగా ఉందని సిబ్బంది చెప్పుకొస్తున్నారు. 12 లక్షల జనాభాకు కనీసం 150 మంది సిబ్బంది 5 వాహనాలు, 10 మంది డ్రైవర్లు, ఒక పూర్తికాలం సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమించాలని, దీనిపై కమిషనర్ స్పందించాలని సిబ్బంది వేడుకున్నారు.



మృతదేహాలను వెలికితీస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది (ఫైల్)

సాహస కార్యాలు

- గొర్రెకుంటలో హత్యచేసి పడేసిన 9 మృతదేహాలు వెలికితీత.
- హంటర్‌రోడ్డులో వరదలో మునిగిపోయిన ఇద్దరు వృద్ధులు, నలుగురు మహిళలను నీటి ప్రమాదం నుంచి తప్పించారు.
- సమ్మయ్యనగర్‌లో వరదలో చిక్కిన వారిని పడవల సహాయంతో కాపాడారు.
- భద్రకాళి సంతోషిమాత గుడి వెనుక గుండంలో మృతి చెందిన వృద్ధురాలి వెలికితీత.
- కేసీ కెనాల్ ఆటోనగర్ వద్ద రెండు మృతదేహాల వెలికితీత.
- నక్కలపల్లిలో బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహం వెలికితీత.
- న్యూశాయంపేట చెరువులో మృతదేహం వెలికితీత.
- రంగంపేటలో బావిలో పడిన వృద్ధురాలి మృతదేహం వెలికితీత.
- ఏనుమాముల మార్కెట్ వెనుక ముసలమ్మకుంటలో ఇద్దరి మృతదేహాలు వెలికితీత.
- గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన 452 చెట్లు తొలగింపు.
- 240 అక్రమ కట్టడాలు, నిర్మాణాలు తొలగింపు.

బల్దియాలో బదిలీ ప్రకంపనలు

సెక్షన్‌లో ఆరా తీస్తున్న ఉద్యోగులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: వరంగల్ బల్దియాలో వివిధ విభాగాల సిబ్బందికి, వింగ్ అధికారులకు బదిలీలు తప్పవనే వార్తలు ఉద్యోగుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియాలో బదిలీల గుబులు' అనే వార్త ప్రచురితం కావడం చర్చనీయాంశమైంది. ట్రాన్స్‌ఫర్ అయ్యే సుమారు 126 మంది ఉద్యోగుల్లో తమ పేరు ఉందా? అని బల్దియా ఉన్నతాధికారులు, సి-1 సెక్షన్ సిబ్బంది వద్దకు వెళ్లి రహస్యంగా తెలుసుకున్నారు. ఇంకా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, పబ్లిక్ హెల్త్, మలేరియా, హార్టికల్చర్ సిబ్బంది వారి అనుయాయులను ట్రాన్స్‌ఫర్ విభాగం సెక్షన్ అధికారుల వద్దకు పంపించి విచారించినట్లు సమాచారం. ఇంకా కొందరు ఫోన్‌ల ద్వారా బదిలీ ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు.

ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు

బల్దియాలో బదిలీలు జరుగుతాయని తెలిసిన ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇంకా కొందరు మునిసిపల్ అధికారులను ప్రసన్నం చేసుకుని బదిలీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఢిల్లీలో ఉన్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే నగరానికి వచ్చిన తర్వాత సర్వీస్ బుక్ ఆధారంగా బదిలీలు తప్పకుండా జరుగుతాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక



ఐనవోలు, జూన్ 14: ఐనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బండ విజయ్ ఎన్ఎంఎంఎస్(జాతీయ స్థాయి)లో ఉపకారవేతనానికి ఎంపికయ్యారు. ఈ యేడు ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో పాల్గొని ఎంపికైనట్లు ఆ విభాగం ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు పి. సత్యానారాయణరావు తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున రూ.48 వేల ఉపకార వేతనాన్ని పొందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి విజయ్‌ను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అఖిల భారత నృత్యోత్సవంలో ప్రతిభ

కాజీపేట, జూన్ 14: ఒడిషాలోని పూరి జగన్నాథ దేవాలయంలో జరిగిన అఖిల భారత నృత్యోత్సవంలో వివిధ విభాగాల్లో తాళ్లపల్లి పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పాఠశాలకు చెందిన ఆశ్రితారెడ్డి గ్రూప్ డ్యాన్స్ కేటగిరిలో ప్రథమ బహుమతి గెలుచుకోగా, డ్యూయెట్ డాన్స్ కేటగిరిలో నిగేషిత ప్రథమ బహుమతి సాధించారు. వీరిని చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.

కుంగిన ఏడో బ్లాక్‌లో మరో గేటు ఎత్తివేత

● మొత్తం 11గేట్లలో 10గేట్ల ఎత్తివేత పూర్తి ● మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న 20వ గేటు తొలగింపు పనులు ● ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు



పూర్తిగా పైకెత్తిన 21వ నెంబరు గేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 14 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో గేట్ల ఎత్తివేత పనులు చివరి దశకు చేరుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం 21వ నెంబరు గేటును 12.50 మీటర్ల ఎత్తుకు విజయ వంతంగా ఎత్తారు. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లు ఉండగా శుక్రవారంవరకు 10 గేట్లను ఎత్తివేశారు. కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ గేటు ఎత్తడం ఇబ్బందికరంగా మారడంతో గత నెల 25న ఆర్క్‌గ్రౌగింగ్ పద్ధతిన గేటు కట్‌చేసి తొలగించే పనులు ప్రారంభించారు. రెండు రోజుల క్రితమే గేటు కటింగ్ పూర్తయినప్పటికి దాని విడిభాగాల తొలగింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లర్ల కిందున్న అగాదం పూడ్చివేతలో భాగంగా చేపట్టిన ఇసుక, సిమెంటు గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీబ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

గేట్లు ఎత్తారిలా..

తొలుత బ్లాక్-7లోని 11 గేట్లలో 19, 20, 21, 22గేట్లను ఎత్తేందుకు వీలుకాదని.. వీటన్నింటిని తొలగించాలని అధికారులు భావించారు. ఆ తర్వాత 19, 22 గేట్లను ఆటోమాటిక్ పద్ధతిన ఎత్తిన అధికారులు 20, 21 గేట్లను తొలగించాలని నిర్ణయించారు. తాజాగా చేపట్టిన ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులతో పిల్లర్ల కింద గట్టిదనం ఏర్పడటంతో శుక్రవారం కుంగిన పిల్లరు పక్కనే ఉన్న 21వ గేటును సైతం విజయవంతంగా పైకెత్తారు. నెల రోజుల వ్యవధిలో గేట్లు ఎత్తే ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకువచ్చారు. గత మే నెల 17న 15వ నెంబరు గేటును ఎత్తగా, జూన్ 6న 16, 17 గేట్లను ఎత్తారు. 8న 22వ గేటును ఎత్తిన అధికారులు తాజాగా గురువారం సాయంత్రం 18, 19 గేట్లను, శుక్రవారం 21వ గేటును ఎత్తారు. దీంతో బ్లాక్-7లో మొత్తం 11 గేట్లకు గాను 10 గేట్లను ఎత్తివేశారు.

ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఏడో బ్లాక్‌లో న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందం ఆధ్వర్యంలో చేపట్టిన టెస్టులు, పలు నమూనాల సేకరణ పనులు శుక్రవారంతో ముగిశాయి. జూన్ 5వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్-7లో సీఎస్ఎంఆర్ఎస్‌కు చెందిన హరిదేవ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల నిపుణుల బృందం భూభౌతిక, మృత్తిక, భూసాంకేతిక పరీక్షలను ప్రారంభించింది. పది రోజుల పాటు బ్లాక్-7లో చేపట్టవలసిన పరీక్షలు, నమూనాలను సేకరించిన బృందం పరీక్షల్లో ప్రధానమైన జియోఫిజికల్, జియోటెక్నికల్, కాంక్రీట్‌పరీక్షలను పూర్తిచేసి శుక్రవారం న్యూఢిల్లీకి వెళ్లిపోయారు. బ్యారేజీ కింద 25 మీటర్ల లోతున ఉన్న మట్టి నమూనాలతో పాటు మరికొన్ని శాంపిల్స్ సేకరణను నిర్మాణ సంస్థతో పాటు ఇంజనీరింగ్ అధికారులు సేకరించి న్యూఢిల్లీలోని సీఎస్ఎంఆర్ఎస్ ల్యాబ్‌కు పంపించాలని చెప్పి వెళ్లినట్లు తెలిసింది. సీఎస్ఎంఆర్ఎస్ బృందం చేపట్టిన పరీక్షలు ఇంతటితో పూర్తి కావని, మరో ఐదారు విడతలు బ్యారేజీని పరిశీలించి పరీక్షించనున్నట్లు తెలిసింది.

మూలమలుపులో కలప లారీ బోల్తా

గూడూరులో దుంగలు మీదపడి ఇద్దరి దుర్మరణం ● మృతుల్లో సీఐ గన్‌మెన్, సీఆర్టీ ఉపాధ్యాయుడు



గూడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న మృతుల బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు



గూడూరు వద్ద లారీబోల్తా పడిన ఘటనలో మృతి చెందిన ధనసరి పాపారావు, చుంచా దేవేందర్

గూడూరు, జూన్ 14: కలపదుంగల లోడుతో వెళుతున్న ఓ లారీ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన గూడూరులో శుక్రవారం ఉదయం జరిగింది. మృత్యుశకటంలా వచ్చిన ఆ లారీ రహదారి పక్కన టీ తాగుతున్న ఇద్దరి ప్రాణాలు తీయడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి గూడూరు ఎస్ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జామాయిల్ కలప దుంగల లోడుతో ఓ లారీ మహబూబాబాద్ మీదుగా బలార్షాకు వెళుతోంది. శుక్రవారం ఉదయం గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మూలమలుపు వద్ద వేగంగా వచ్చిన ఆ లారీ ఆదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని దుంగలు మీదపడి గూడూరు మండలం మట్వాడ శివారు కొంగరిగిద్దకు చెందిన ధనసరి పాపారావు (35), మచ్చర్లకు చెందిన చుంచా దేవేందర్ (34) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ధనసరి పాపారావు గూడూరు సీఐ గన్‌మెన్‌గా, చుంచా దేవేందర్ ములుగు జిల్లా రాయినిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. మానుకోట పట్టణంలో జరిగే పోలీస్ శిక్షణ కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై ఉదయం కొంగరిగిద్దలోని ఇంటి నుంచి ధనసరి పాపారావు ఠాణాలో ఉన్న బూట్లు, యూనిఫాం కోసమని బయలు దేరి వస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లేందుకు మచ్చర్ల వద్ద బస్సుకోసం వేచిచూస్తున్న దేవేందర్‌ను బైక్‌పై ఎక్కించుకుని గూడూరుకు చేరుకున్నారు. వరుసకు అన్నదమ్ములైన వారు బైక్‌ను పక్కన పెట్టి, గూడూరులోని మూలమలుపు బస్టాప్ పక్కనే ఉన్న టీస్టాల్ వద్ద టీ తాగుతున్నారు. 365 జాతీయ రహదారిపై జమాయిల్ కలప దుంగల లోడుతో వచ్చిన లారీ అదుపు తప్పి గూడూరులోని బస్టాండ్ మూలమలుపు వద్ద బోల్తా పడింది. అక్కడే ఉన్న పాపారావు, దేవేందర్‌పై దుంగలు పడడంతో అక్కడికక్కడే వారు మృతి చెందారు.

ఎస్ఐ నగేష్ ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ దుంగలను తొలగించే సహాయక చర్యలు పర్యవేక్షించారు. స్థానికుల సాయంతో దుంగలను తొలగించి పాపారావు, దేవేందర్‌ను బయటకు తీయగా, అప్పటికే వారు మృతిచెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం గూడూరు మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ గన్‌మెన్ ధనసరి పాపారావు కుటుంబసభ్యులను ఎస్పీ పరామర్శించి, ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.20 వేలు అందించారు. అనంతరం కొంగరిగిద్దలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో పాపారావు అంత్యక్రియలను పూర్తి చేశారు. అలాగే మచ్చర్లలో చుంచ దేవేందర్ అంత్యక్రియలు జరిగాయి. అంత్రక్రియల సమయంలో దేవేందర్ మృతిని తట్టుకోలేక రోదిస్తున్న భార్య భారతి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఎస్పీ ఆస్పత్రికి చేరుకుని, భారతిని ధైర్యంగా ఉండాలని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డీఎస్పీ తిరుపతిరావు పాపారావు, దేవేందర్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాపారావు, దేవేందర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు గూడూరులో ధర్నా నిర్వహించారు. ఎస్సై నగేష్ మృతుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

ఒకే పాఠశాలలో ఇద్దరి విద్యాభ్యాసం

పాపారావు, దేవేందర్ తమ విద్యాభ్యాసాన్ని గూడూరు మండలం దామెరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పూర్తి చేశారు. పాపారావు 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేయగా, దేవేందర్ 2004-05లో ఎస్సెస్సీ పూర్తి చేశాడు. ఒకేచోట చదువుకున్న ఇరువురు బంధుత్వంతో పాటు మంచి మిత్రులుగా ఉండేవారు. మృత్యువులో కూడా వారి స్నేహబంధం వీడకపోవడం అందరి మనస్సులను కలచివేసింది.

ప్రమాదం నుంచి బయటపడ్డ మరో ముగ్గురు..

గూడూరులో ప్రమాదం జరిగిన సమయంలో టీకొట్టు యాజమాని మౌలానా టీ పొడి తీసుకొచ్చేందుకు కిరాణా షాపునకు వెళ్లగా, మానుకోట పట్టణం గుమ్ము దూరుకు చెందిన మరోవ్యక్తి పొగాకుల పోతరాజు వ్యాపారం చేసుకుంటూ బస్టాండ్ వద్దకు ఉన్న టీస్టాల్ ముందు ఆటో నిలిపాడు. ఆయనకు ఫోన్ రావడంతో పక్కవెళ్లి మాట్లాడుతున్నాడు. ఇంతలోనే కలప దుంగలతో వచ్చిన లారీ ఒక్కసారిగా బోల్తా పడడంతో వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పక్కనే ఉన్న కూరగాయల దుకాణం తీసేందుకు వచ్చి వ్యాపారి సురేష్‌కు కలప దుంగలు తగలడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా రౌతుగూడెంలో ఘటన



రౌతుగూడెంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న కొత్తగూడ ఎస్సై దిలీప్

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 14 : విధి ఆ కుటుంబాన్ని పగపట్టింది. వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో భర్త మరణించడాన్ని జీర్ణించుకోలేకపోయినా ఆ ఇల్లాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పది రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని రౌతుగూడెంలో జరిగింది. ఎస్ఐ దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం.

కొత్తగూడ మండలంలోని రౌతుగూడెం గ్రామానికి చెందిన మాలోతు రవికి వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురానికి చెందిన సరిత (38)తో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. వ్యవసాయంతో పాటు కూలిపనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన వరంగల్ జిల్లా సంగెం మండలంలో తమ బంధువు మరణించగా పరామర్శించేదుకు వెళ్లి, తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మాలోతు రవి మృతి చెందాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సరిత గురువారం రాత్రి గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఇంట్లో సరిత కనిపించక పోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామశివారు బావిలో సరిత మృతదేహాన్ని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించారు. మృతురాలి సోదరుడు అంగోత్ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ దిలీప్ తెలిపారు. ఇక సరిత చెల్లెలు కూడా పది రోజుల క్రితం మరణించింది. ఇలా వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయని స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.



మాలోతు రవి, సరిత (ఫైల్)

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

అవగాహన కల్పించాలన్నారు. యుక్తవయస్సులో వచ్చే మార్పులపై అన్నికళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. భ్రూణహత్యలను నివారించి, బాలికల నిష్పత్తి పెరిగే విధంగా పోలీస్ కళాజాత, స్వయం సహాయక సంఘాల, పౌరసంబంధాల శాఖ, సాంస్కృతిక కళాకారుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు అలివేలు, నర్సింహరావు, డీఎస్పీ తిరుపతి రావు, డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, వైద్య విధాన పరిషత్ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరిండెంట్ జగదీశ్వర్, ప్రోగ్రాం అధికారి బిందుశ్రీ పాల్గొన్నారు.

సౌలతుల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..

మహబూబాబాద్ జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వ పీజీ కళాశాల సెంటర్‌ను ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. మానుకోట పట్టణ కేంద్రంలో పీజీ కళాశాలను ప్రారంభించి దశాబ్దకాలం పూర్తయినా, భవన నిర్మాణం, మౌళిక వసతుల కల్పనపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటంవిచారకరం. గిరిజన జనాభా అధికంగా ఉన్న మానుకోట జిల్లాలో పార్లమెంట్ సభ్యులు, పూర్తిస్థాయిలో ఉన్న మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు గార్ల, బయ్యారం మండలాలతో కూడిన ఇల్లందు నియోజకవర్గం, తొర్రూరు, పెద్దవంగర మండలాలతో కూడిన పాలకుర్తి, కొత్తగూడ, గంగారం మండలాలతో ఉన్న ములుగు నియోజక వర్గాల ఎమ్మెల్యేలతోపాటు ఇదే ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీలు కూడా ఉన్నారు. అయినప్పటికీ మహబూబాబాద్ జిల్లాలో ఉన్న ఏకైక పీజీ కళాశాలను పూర్తిస్థాయిలో పక్కా భవన నిర్మాణాలు చేపట్టి విద్యారంగ అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పీజీ కళాశాలకు భవనం నిర్మించాలి..



డోలి సత్యనారాయణ, విద్యావేత్త, మానుకోట

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న పీజీ కళాశాలకు తక్షణమే సొంత భవనం నిర్మించాలి. సొంత భవనంలేక రేకులషెడ్డులో తరగతులు నిర్వహించడంతో పాటు మౌళిక వసతుల లేమితో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పీజీ కళాశాలకు పక్కా భవనం నిర్మించడంతో పాటు పలు కొత్త కోర్సులను ప్రవేశ పెట్టి రెగ్యులర్ ఆధ్యాపకులను నియమించాలి.

తీరనున్న కేసముద్రం కరెంటు కష్టాలు

- రూ.1.50 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరు
- తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుకు పరిశీలన

కేసముద్రం, జూన్ 14 : పదేళ్లుగా కేసముద్రంలో ప్రజలు పడుతున్న కరెంటు కష్టాలు ఇక తీరనున్నాయి. ధన్నసరిలోని సబ్‌స్టేషన్ నుంచి మూడు, నాలుగు గ్రామాల్లో 25 కిలోమీటర్ల వ్యాప్తిలో ఫీడర్, వేలసంఖ్యలో కనెక్షన్లు ఉండ దంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా గత పదేళ్లుగా కేసముద్రం స్టేషన్, విలేజి, అమీనాపురం పరిసరతండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే మురళీనాయక్ చొరవ తీసుకొని లిఖిత పూర్వకంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విన్నవించినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసముద్రానికి సుమారు రూ.1.50కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీసబ్‌స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపున ఉన్న ఖాళీ స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మురళీనాయక్, డీఈవిజయ్‌కుమార్, తహసీల్దార్ దామోదర్ పరిశీలించారు. త్వరలో స్థలాన్ని విద్యుత్‌శాఖకు స్వాధీనపర్చి సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తే గృహ, పరిశ్రమ, వ్యవ సాయ విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఉండవని డీఈ తెలిపారు.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వైద్యఆరోగ్య, విద్యా, సంక్షేమ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని వైద్య, ఆరోగ్యవిద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఏదేని కారణాలతో మిగిలిపోయిన చిన్నారులకు ఈనెల 27న నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి కళావతిబాయి మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయబడునని, ఇందులో 1 నుంచి 2 సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తిగా మాత్ర వేయాలన్నారు. ఇది నమిలి మింగాలని ఎట్టి పరిస్థితుల్లో పిల్లలు మాత్రలను ఇంటికి తీసకువెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో, అధికారులు నర్మద, డాక్టర్ అంబరీష పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

లారీ ప్రమాద ఘటనలో మృతులకు పలువురి నివాళి



మచ్చర్లలో దేవేందర్ మృతదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న సీఆర్టీల అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు



గూడూరులో పాపారావు, దేవేందర్ మృతదేహాల వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, జూన్ 14 : మండల కేంద్రంలో కలప దుంగల లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన మట్టేవాడ శివారు కొంగరిగిద్దకు చెందిన ధనసరి పాపారావు (35), మచ్చర్లకు చెందిన చుంచా దేవేందర్ (34) మృతదేహాలకు శుక్రవారం పలువురు నివాళులర్పించారు. మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వేర్వేరుగా నివాళ్లర్పించారు. జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం, గూడూరు మాజీ ఎంపీపీలు నూనావత్ రమేష్‌నాయక్, చెల్పూరి వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, సీఆర్టీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సోమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారావత్ బాలాజీ, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు పెనక ప్రభాకర్, ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ బాధ్యుడు సురేందర్ రావు, రాష్ట్రనాయకుడు వీరయ్య, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పడిగె నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కోశాధికారి బత్తుల శ్రీనివాస్, రేగ సాంబయ్యనివాళ్లర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుల అంత్యక్రియల కార్యక్రమాలను డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు బాబురావు, దేవేందర్, ఉపేందర్, ఎస్సైలు నగేష్, దిలీప్, రవికుమార్, వంశీధర్, నరేష్ పర్యవేక్షించారు.

అనర్హులు క్లినిక్‌లను నిర్వహిస్తే కఠిన చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్

మరిపెడ, జూన్ 14 : అనర్హులు క్లినిక్‌లను నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తొర్రూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలు ప్రైవేట్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ రవి, వనకర్‌రెడ్డి, శాంతకుమారి, సుదర్శన్, వెంకటేశ్వర్లు, శోభరాణి, పల్లె దవాఖాన డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. కాగా, ప్రైవేట్ క్లినిక్‌ల తనిఖీలో ప్రసాద్, కృష్ణ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్స్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

మరిపెడ, జూన్ 14 : మునిసిపల్ కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపుల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మండల వ్యవసాయ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకుండా అమ్ముతున్న 22 లీటర్ల గడ్డి మందును స్వాధీనం చేసకొని సూర్యతేజ ఏజెన్సీ, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంపై చర్యలు తీసుకోనున్నట్లు ఏవో వీరాసింగ్ తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఉమ, ఎంఏవో వీరాసింగ్, ఏఈవో శశికుమార్, పోలీస్ కానిస్టేబుళ్లు అబ్బల్‌నాయక్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ అడ్వజరీ కమిటీ సభ్యుడిగా కృష్ణారెడ్డి



చిన్నగూడూరు, జూన్ 14 : ఆయిల్ పామ్ తెలంగాణ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన ఆయిల్ పామ్ రైతు వల్లూరి కృష్ణారెడ్డి నియమితులైనట్లు శుక్రవారం రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పంట రుణాలు అందించాలని ధర్నా

తొర్రూరు, జూన్ 14 : రైతులకు పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొత్త వెంకట్ రెడ్డి, బొల్లం అశోక్, వెంకటేశ్వర్లు, వీరన్న, యాకయ్య, ప్రశాంత్, రాములు, ఎల్లయ్య శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

- కురవి : రైతాంగానికి పాత రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిజీ నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కురవి యూనియన్ బ్యాంకు ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. కొండబత్తుల వెంకన్న, కట్ల కృష్ణ, వీరభద్రం, ఇరుగు సత్యం, బత్తిని వెంకన్న, బిచ్యానాయక్, చిలకమ్మ, బానోత్ సునీత, శంకర్, సాల్కి పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య'

దంతాలపల్లి, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని దంతాలపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం కల్పించిందని అందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఉచితంగానే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పారిశుధ్య పనుల నిర్వహణ

తొర్రూరు, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిచే పారిశుధ్య పనులు చేపట్టిన సంఘటన తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో ఆ వీడియో వైరల్ అయింది. పట్టణంలోని దుబ్బతండా ప్రభుత్వ డీఎన్‌టీ పాఠశాలలో బుధవారం పాఠశాలల పునఃప్రారంభ నేపథ్యంలో ఉపాధ్యాయుడు విద్యార్థులచే పాఠశాలను శుభ్రం చేయించాడు. విద్యార్థులతో పారిశుధ్య పనులు చేయించడంపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థి చేత చీపురు పట్టించి పనులు చేయించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. విద్యార్థి పనులు చేస్తుంటే టీచర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కాలయాపన చేస్తున్నాడని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈవోను వివరణ కోరగా, విచారణ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

'ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి'

కొత్తగూడ, జూన్ 14 : ప్రైవేటు కళాశాల ప్రచారంకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌లు ప్రచారం చేస్తున్నారు. కొత్తగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కళాశాల లెక్చరర్‌లు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్‌లు, కర పత్రాలు ముద్రించారు. కళాశాల లెక్చరర్‌లు శుక్రవారం వాల్ పోస్టర్‌లు వేస్తు, సంతలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ప్రధాన కూడళ్లలో ఫెక్సీలు ఏర్పాటు చేశారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల వివరాలు, ఫోన్ నెంబర్‌లు సేకరించి, వారికి ఫోన్‌చేసి కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు. ఎస్టీ విద్యార్థిని, విద్యార్థులు ఎస్ఎంహెచ్ హస్టల్ సౌకర్యం ఉందని వారికి అవగాహన కల్పిస్తున్నారు.

కిడ్నీ నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడ, జూన్ 14 : కిడ్నీ నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అంకన్నగూడెంలో శుక్రవారం జరిగింది. ఎస్సై దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎర్రబోతుల సుధాకర్ రెడ్డి (38) గత కొంత కాలంగా కిడ్నీ నొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం పొలం నుంచి ఇంటికి వచ్చిన సుధాకర్‌రెడ్డి వద్ద పురుగుల మందు వాసన రావడం గమనించిన ఆయన కుమారుడు అరుణ్‌రెడ్డి తల్లి కవితకు చెప్పాడు. సుధాకర్‌రెడ్డిని ఆయన భార్య నిలదీయడంతో కిడ్నీ నొప్పి తీవ్రంగా రావడంతో పురుగుల మందు తాగానని చెప్పడంతో హుటాహుటిన నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య కవిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు. మృతునికి కుమారుడు, కుతురు ఉన్నారు.

మూసివేసిన ప్రభుత్వ బడిని తెరిపించాలి

- డీఈవోకు వినతి పత్రం అందజేత

సీరోలు, జూన్ 14 : సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామ శివారు గుజిలీతండలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలను తెరిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో రామారావుకు వినతి పత్రం అదంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తండాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గత కొంత కాలంగా విద్యార్థులు లేరని మూసివేశారని, 2024 విద్యాసంవత్సరంలో చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిప్పరపల్లి వెంకన్న పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఆర్టీసీ ఉద్యోగులు

నర్సింహులపేట, జూన్ 14 : తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మానవత్వం చాటారు. తోటి ఉద్యోగి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో కుటుంబ పరిస్థితులను తెలుసుకొని రూ.65,650 నగదు, 25 కేజీల బియాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. నర్సింహులపేటకు చెందిన మంచినీళ్ల రవీందర్‌రెడ్డి కొంతకాలంగా తొర్రూరు ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ గార్డుగా విధులునిర్వహిస్తూ కుటుంబాన్ని సాకాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడు. ఈనెల 7న మృతి చెందాడు. రవీందర్‌రెడ్డి కుటుంబ పరిస్థితులను గమనించిన తొర్రూరు డిపోలో విజిలెన్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రేమలత ఆర్టీసీ వాట్సర్ గ్రూపులో పోస్టుచేయడంతో సోషల్ మీడియాలో వైరలైంది. 116 మంది తోటి ఉద్యోగులు స్పందించి రూ.65,650 నగదు జమచేశారు. వాటితో పాటు, ప్రేమలత సొంతంగా ఇచ్చిన 25 కేజీల బియ్యాన్ని డిపో మేనేజర్ పద్మావతి, హెడ్‌కానిస్టేబుల్ పీఎం.రెడ్డి,ఎల్‌హెచ్ గోపాల్, మరి కొందరు ఉద్యోగులు బాధిత కుటుంబానికి అందజేశారు. కాగా, 1984-85 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు రూ.25 వేలు అందజేశారు. ఉదయ్‌పాల్, గడ్డి యాకయ్య, మాల్లారెడ్డి, రంగారెడ్డి, రాజు, రుద్ర, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అత్యధిక సార్లు రక్తదానం చేసిన.. వెంకన్నకు రాష్ట్రస్థాయి అవార్డు



వెంకన్నకు ప్రశాంసా పత్రాన్ని అందజేస్తున్న అజయ్‌మిశ్రా

మహబూబాబాద్ టౌన్, జూన్ 14 : హైదరాబాద్ రాజ్‌భవన్‌లో శుక్రవారం అత్యధిక సార్లు రక్తదానం చేసిన ఐఆర్‌సీఎస్ మానుకోట జిల్లా సభ్యుడు గొర్రె వెంకన్న ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ అజయ్‌మిశ్రా, రాష్ట్ర గవర్నర్ సెక్రటరీ, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర వెంకటేశం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ రాజ్‌భవన్‌లో రక్తదానం చేసిన ప్రోత్సహిం చిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగా ఎక్కు వసార్లు రక్తదానం చేసిన వెంకన్న, రక్తదానాన్ని ప్రోత్సాహించిన జిల్లా పోలీస్ శాఖ, ప్రభుత్వ శాఖల విభాగంలో అదనపు కలెక్టర్, స్వచ్ఛంద సంస్థల విభాగంలో కురవి మండలం మోద్గుల గూడెం బంజార యూత్ అసోసియేషన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లు దక్కాయి. ఇందులో ఐఆర్‌సీఎస్ రాష్ట్ర చైర్మన్ అజయ్‌మిశ్రా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర వెంకటేశం చేతుల మీదుగా గొర్రె వెంకన్న అవార్డుతో పాటు ప్రశంసా పత్రా న్ని అందుకున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, జూన్ 14 : ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డిపో ఆవరణలో జెండా ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. నాయకులు ఎం.కృష్ణారావు, జె.వై.గిరి, వెంకన్న, సతీష్, సుధాకర్, మనోహర్, వీరస్వామి, శంకర్ ఉన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

- రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నెహ్రూరాథోడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 14 : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానం చేయడం వలన కలిగే ప్రయోజనాలపై విద్యార్థినీలకు ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు రావుల రవిచంద్రారెడ్డి, , మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు పటేల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామారావు

మహబూబాబాద్ టౌన్, జూన్ 14 : మహబూబాబాద్ మున్నూరు కాపు పటేల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పిట్టల బుచ్చిరామారావు ఎన్నికయ్యారు. స్థానిక మున్నూరు కాపు ఉద్యోగ సంఘం భవనంలో శుక్రవారం అసోసియేషన్ సభ్యులు సమావేశమై అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్టల బుచ్చిరామారావు, కార్యదర్శిగా పిట్టల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి , మున్నూరు కాపులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి నూతన అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చిరామారావు, శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్టర కార్యదర్శి శంతన్‌రామారాజు, మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు .ఇన్నారెడ్డి శ్రీనివాస్, మద్దెల రమేష్, ఆవుల కుమార్, పిట్టల చంద్రశేఖర్, బొళ్ల జగయ్య, చిరంజీవి, సుతారపు వెంకటనారాయణ పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

గార్ల జూన్ 14 : మండల పరిధిలోని బుద్దారంతండాలో శుక్రవారం పోలీసులు గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గుడుంబా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి 13 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. వాకుడోత్ భారతి, తారాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

బీసీ హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్14 : జిల్లాలోని వెనుకబడిన తరగతుల (బీసీ) ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, కళాశాలల వసతి గృహాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నరసింహస్వామి శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలల్లో విద్యనభ్యసిస్తున్న 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రీ మెట్రిక్‌లో 465 ఖాళీలు, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఎడ్, ఐటీఐ పోస్ట్‌మెట్రిక్‌లో 370 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన ఆసక్తిగల విద్యార్థులు జిల్లాలోని వివిధ పట్టణాలు, మండలాల్లో ఉన్న బాల, బాలికల బీసీ వసతి గృహాల అధికారులనులేదాhttp:// bchostels. cgg. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

పలు మండలాల్లో వర్షం

- దంతాలపల్లిలో భారీ వాన



దంతాలపల్లిలో కురుస్తున్న వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 14 : జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం సాయంత్రం వచ్చిన గాలి దుమారంతో పాటు వర్షం కురిసింది. దంతాలపల్లిలో భారీ వాన పడింది. నెల్లికుదురు, మరిపెడ, పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో కేవలం గాలిదుమారం తప్ప వర్షం కురియలేదు. దంతాలపల్లిలోని ప్రధాన రహదారితో పాటు పలు చోట్ల అనేక భారీచెట్లు నేలకూలాయి, తొర్రూరు మండలంలో గాలిదుమారంతో మోస్తారు వర్షం కురిసింది. తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ సమీపంలో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై చెట్టు కూలిపోయింది.

వేతనాల కోసం జీపీ కార్మికుల నిరసన

నెల్లికుదురు, జూన్ 14 : గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎంపీడీవో బాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు మాట్లాడుతూ గత 10 నెలలుగా జీపీ కార్మికులకు వేతనాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామాలలో కార్మికులు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అదనంగా పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పనిభారం పెరిగిందన్నారు. ఇప్పటికైనా పాఠశాలల్లో పనిచేసే స్కావేంజర్లను విధుల్లోకి తీసుకొని వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు బొల్లం ఎల్లయ్య, తూళ్ల ఎల్లయ్య, వెంకన్న, నర్సయ్య, ఐలమ్మకృష్ణ, వెంకన్న, విజయ, శ్రావణి, సుభాష్ వీరస్వామి పాల్గొన్నారు.

20న శ్రీముసలమ్మ జాతరలో వేలం పాట

కొత్తగూడ, జూన్ 14 : ఈనెల 20న గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో భిక్షమాచారి తెలిపారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ జాతరలో ఈనెల 20న కొబ్బరికాయలు, ఫోటోలు, పూజాసామగ్రి అమ్ముకునే హక్కు, తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ఈనెల 18న జాతరలో టెండర్ ఫారాలు తీసుకోవాలని సూచించారు. 20న బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కురవి, జూన్ 14 : అయ్యగారిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ శారద తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. అయ్యగారిపల్లి, కురవి, తిరుమలాపురం, నల్లెల్ల, శివారు తండాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

అనుమానాస్పదంగా రాజస్థాన్ మహిళల సంచారం

- రైలులో గ్యాస్ సిలిండర్లతో ప్రయాణం?
- కేసముద్రంలో దింపిన రైల్వే సిబ్బంది

కేసముద్రం, జూన్ 14 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లోంచి శుక్రవారం ఉదయం సుమారు 30 మంది మహిళలను రైల్వే సిబ్బంది దింపేశారు. ఈ మహిళలు కేసముద్రంలో రోడ్డు వెంట వెళుతున్న వారినినిలిపి డబ్బులు అడుగుతుండడంతో పలువురు ఆందోళన చెందారు. స్థానికులు వారిని ఫొటోలను తీస్తుండగా ముఖం చాటేస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తంచేస్తూ- పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు వచ్చి ఈ మహిళలపై ఆరా తీయగా ఖర్చులకు డబ్బులు లేక అడుక్కుంటున్నారని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన వీరంతా రోడ్లవెంట, కూడళ్లలో ప్లాస్టిక్ బొమ్మలు విక్రయిస్తూ జీవిస్తున్నట్లు పోలీసులకు తెలిపారు. కాజీపేట నుంచి విజయవాడకు వెళ్లేందుకు ఈ మహిళలు తమ పిల్లలతో కలిసి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కినట్లు తెలిపారు. అయితే వీరివద్ద వంట చేసుకునేందుకు ఉపయోగించే చిన్నగ్యాస్ సిలెండర్లు రెండు ఉన్నాయి. కాజీపేటలో రైలు రాగానే ఈ సిలెండర్‌తోపాటే రైలులో ఎక్కినట్లు తెలిపారు. ఇదే రైలులో ప్రయాణిస్తున్న రైల్వే సిబ్బంది సిలెండర్లను గుర్తించి కేసముద్రంలో రైలు నిలిచిన వెంటనే వీరందరినీ కిందకు దింపినట్లు వారు చెప్పారు. ఫలితంగా కేసముద్రం లో కృష్ణాఎక్స్‌ప్రెస్ రైలు 15 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఇతర రాష్ట్ర వేషధారణతో ఉన్న ఈ మహి ళలు దారివెంట వెళుతున్నవారిని డబ్బులు అడుగుతుండడంతో తొలుత వీరిపై అనుమానంతో ఆందోళన చెందిన పలువురు విషయం తెలుసుకున్న అనంతరం ఊరట చెందారు.

ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, జూన్ 14 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను గౌరవ సలహదారులు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, ఎంప్లాయిస్ నాయకులు రఫిక్‌పాషా, కట్ల నర్సయ్య రావు, సారయ్య, పూల్‌సింగ్, ముగ్దుం మియా, జమీల్, మాధవరావు, వెంకటేశ్వరు పాల్గొన్నారు.